సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



మృత్యు కుహరంగా పెన్నా నది

పెన్నానది మృత్యుకుహరంగా మారుతోంది. పెన్నానదిలో నీరు ఉండటంతో ఈత కోసం, స్నానాల కోసం దిగి లోతు తెలుసుకోలేక గుంతల్లో పడి మరణిస్తున్నారు. - 8లో



నులి పురుగుల నివారణకు చర్యలు

పిల్లల్లో నులి పురుగులు నిర్మూలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. - 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.0 /27.6

జిల్లాలో సోమవారం 27.6 – 36.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, తదితరులు

పులివెందుల : పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన పులివెందుల మండలంలో జరిగే జెడ్పీటీసీ ఎన్నికకు సంబంధించి మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశామన్నారు. కార్యక్రమంలో పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్, సీఐలు ఉలసయ్య, వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

బి.ఫారాలు అందజేత



బి.ఫారాలను అందజేస్తున్న కార్పొరేటర్ మల్లికార్జున, పులి సునీల్‌కుమార్‌లు

కడప సెవెన్‌రోడ్స్ : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పులివెందుల జెడ్పీటీసీ అభ్యర్థిగా తుమ్మల హేమంత్‌రెడ్డి, ఒంటిమిట్ట జెడ్పీటీసీ అభ్యర్థిగా ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిలను ఆ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు వారిరువురికి సంబంధించిన బి.ఫారాలను కార్పొరేటర్ మల్లికార్జున, సోషల్ వెల్ఫేర్ మాజీ చైర్మన్ పులి సునీల్‌కుమార్ సోమవారం ఎన్నికల అధికారి సి.ఓబులమ్మకు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : వర్కింగ్ జర్నలిస్టులు సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నాయకులు సోమవారం డీఆర్వోకు వినతిపత్రాన్ని సమర్పించారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని, పెన్షన్ చెల్లింపు, అక్రిడిటేషన్ల జారీకి వీలుగా కొత్త జీఓ తీసుకు రావాలన్నారు. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల అవార్డుల ప్రదానం చేపట్టాలని కోరారు. వృద్ధ జర్నలిస్టుల కోసం ఆశ్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు చంద్రమోహన్‌రాజు, నూర్‌బాష, రాజేష్, రవిప్రకాశ్, సిద్ధయ్య, నారాయణ, అమర్, పఠాన్, విష్ణు, రవి తదితరులు పాల్గొన్నారు.

రాజుకున్న వేడి

- పులివెందులలో జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారం ప్రారంభం
- అచ్చవెల్లిగంగమ్మ ఆలయంలో నేతల పూజలు
- ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తదితరులు



పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో భాగంగా ప్రచారంలో పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి, పార్టీ నేతలు

సాక్షి ప్రతినిధి, కడప : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారం అట్టహాసంగా ప్రారంభమైంది. సోమవారం అచ్చవెల్లి గంగమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అచ్చవెల్లి గ్రామంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందురెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాదరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి తదితరులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో, చంద్రబాబు పాలను బేరీజు వేసుకొని జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓటు వేయాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ తుమ్మల మహేశ్వరరెడ్డి గంగమ్మ శిరిబండి తోలుతూ ప్రమాదవశాత్తు మృతిచెందితే ఆయన కుమారుడు హేమంత్‌రెడ్డిని పోటీలో నిలిపాం, ఆశీర్వదించాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల నుంచి సానుకూలత లభిస్తుండడంతో మరింత ఉత్సాహంగా ప్రచారాన్ని కొనసాగించారు. పులివెందులను చీల్చలేరు, మన ఐక్యతను దెబ్బతీయలేరంటూ ప్రజల నుంచి ప్రతిస్పందన లభిస్తుండడం విశేషం.

జెడ్పీటీసీ ఎన్నికలు మంత్రులకు బాధ్యత

జెడ్పీటీసీ గెలుపుతో ఒరిగిపోయేదేమి లేకపోయినా టీడీపీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితా, ఉమ్మడి జిల్లా మంత్రి రాంప్రసాదరెడ్డికి పులివెందుల జెడ్పీటీసీ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సమాచారం. ఆమేరకు సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితా ఎన్నికల ప్రచారంలో పాల్గొంది. తుమ్మలపల్లె, ఎర్రిపల్లె గ్రామాల్లో ప్రచారం కొనసాగించింది. మంత్రి వెంట ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఉన్నారు. మంత్రి వర్గ ఉపసంఘం సమావేశం నేపథ్యంలో మంత్రి రామప్రసాదరెడ్డి బుధవారం నుంచి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. చిన్న జెడ్పీటీసీ ఎన్నిక ఏడాది కాల పరిమితి మాత్రమే ఉన్న ఎన్నిక కోసం టీడీపీ, బీజేపీ నేతల తాపత్రయం అంతా ఇంతగా లేదనే చెప్పాలి. పోలీసు అధికారులతో గ్రామస్థాయి నేతలపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ద్వారా రేషన్‌షాపు డీలర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. గతంలో ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్లుగా కూర్చొన్న నేతల్ని పసిగట్టి మరీ ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అధికారులు కొంతమంది పులివెందులలోనే తిష్టవేసి ఇలాంటి ప్రలోభాలకు దిగుతుండడం పలువుర్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తోంది.

- కూటమి నేతల కుట్రలను వైఎస్సార్‌సీపీ బహిర్గతం చేస్తోంది. 48ఏళ్లుగా పార్టీ గుర్తుపై పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లో విజయం సాధించిన వైఎస్ కుటుంబ చరిత్రలో ఇదో అతి స్వల్ప ఎన్నికలు. ఇక్కడి ప్రజలతో వైఎస్ కుటుంబానికి ఉన్న అనుబంధాలను మరెవ్వరూ తెంచలేని స్థితి. అలాంటి చోట అధికార పార్టీ శ్రేణులు, మంత్రులు, అధికారులు, వ్యవస్థలు తిష్టవేసి భయాందోళనకు గురిచేస్తున్న వైనాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు ఎండగట్టుతున్నారు. వైఎస్ కుటుంబానికి వీర విధేయులుగా ఉన్న వారిని కూడా ప్రలోభాలకు గురిచేయడాన్ని ఉదాహరణలతో వివరిస్తున్నారు. ప్రజాభిమానమే ధన్నుగా, గత ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనే పెట్టుబడిగా ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ దిగితే, అధికారం, వ్యవస్థలను నమ్ముకొని టీడీపీ బరిలో ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.




అచ్చవెల్లిగంగమ్మ ఆలయంలో ఎంపీ అవినాష్‌రెడ్డి పూజలు, ప్రజలను ఓటు అడుగుతూ...

మోసాలు చేస్తున్న ప్రభుత్వానికి
ఓటుతో బుద్ధి చెప్పండి

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు



చింతరాజుపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆకేపాటి, అంజద్‌బాషా, సురేష్ బాబు, రెడ్యం

ఒంటిమిట్ట : 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి మోసాలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పే అవకాశం వచ్చిందని, ఈ నెల 12న జరగబోయే ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, మీ సత్తా కూటమి ప్రభుత్వానికి చూపించాలని మండల ప్రజలతో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే సుధా, కడప మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చింతరాజుపల్లి, కోనరాజుపల్లి పంచాయతీల్లోని గ్రామాల్లో అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ఉప ఎన్నిక ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం మేడా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ..తప్పుడు హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ప్రభుత్వానికి ఈ ఎన్నికతో బుద్ధిచెప్పాలన్నారు.

- ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ..సూపర్ సిక్స్ అంటు అధికారంలోకి వచ్చిన సీఎం నారా చంద్రబాబు నాయుడు అహంకారాన్ని అణిచేవిధంగా ఎన్నిక ఫలితాలు తీసుకురావాలని అన్నారు.
- ఎమ్మెల్యే సుధ మాట్లాడుతూ..రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలకు ఇస్తానన్న ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయలేమన్న టీడీపీ నేతలకు ఈ ఉప ఎన్నికల ఫలితాలు చెంప పెట్టుకావాలన్నారు.
- కడప మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ..ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా ఉన్న వారికి నిరుద్యోగ భృతిని ఇస్తానని మోసం చేసిన ప్రభుత్వానికి ఈ ఉప ఎన్నిక ఫలితాలతో సిగ్గు రావాలన్నారు.
- మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మాట్లాడుతూ..రైతులకు ప్రతి ఏటా కేంద్రం ఇస్తున్న రూ. 2 వేలతో కలిపి రూ. 20వేలు ఇస్తానని రైతన్నను నిలువులా ముంచేసిన ప్రభుత్వాన్ని ఓటు అనే ఆయుధంతో ఓడించాలన్నారు.
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ..ఫించన్లు పెంచినట్లే పెంచి వెనుకల గోతులు తీసినట్లు సుమారు 1లక్ష 50 వేల మంది పింఛన్‌దారులను అనర్హులగా చేసిన సీఎం చంద్రబాబుపై ఈ ఉప ఎన్నిక సహాయంతో మీ తిరుగుబాటును చూపించాలన్నారు. - మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ..ఇది మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటూనే ఒక పక్క రెడ్ బుక్ పరిపాలన సాగిస్తుంది ఈ కూటమి ప్రభుత్వం. ఈ రెడ్ బుక్ పరిపాలనలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపే వారందరిపై అక్రమ కేసులు, హత్యా రాజకీయం, మహిళలపై అత్యాచారాలు, దాడులు చేస్తూ శాంతి భద్రతలు అనేటివి మంటగలుస్తున్నాయి. అలాంటి అధికార పార్టీ ని ఓడించి శాంతిభద్రతలను కాపాడాలని కోరారు.
- ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ..రాజంపేట నియోజకవర్గంలో అధికార పార్టీ రాజు లేని రాజ్యంగా తయారైందన్నారు. ఒంటిమిట్ట మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి మండల నాయకులు, కార్యకర్తల మధ్య సఖ్యత లేక వర్గ పోరుతో వారి ఉనికిని కాపాడుకునేందుకు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. అలాంటి వారిని మనం గెలిపించినా ఉపయోగం ఉండదన్నారు.
- రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ..ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని గెలిపిస్తే మండలంలోని ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరి, ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు బలవంతంగా కండువాలు వేశారు



అచ్చవెల్లి నాయకులతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : సోమవారం ఉదయం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని పులివెందుల మండలం అచ్చివెల్లి గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన నాగేంద్ర, జయరాం, గంగాధర్, రామకృష్ణ, రోటో గంగాధర్, దేవుడు, గంగరాజు, ఓబులేసులు కలిశారు. ఈ సందర్భంగా ఎంపీతో వారు మాట్లాడుతూ ఆదివారం తమను తెలుగుదేశం పార్టీకి చెందిన ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవిలు తమ గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వచ్చిన సందర్భంగా బలవంతంగా టీడీపీ కండువాలు కప్పి పార్టీలో చేరినట్లుగా సృష్టించారు. మేము స్వచ్ఛందంగా టీడీపీలో చేరలేదని, తాము ఎప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, వైఎస్ కుటుంబానికి అండగా ఉంటామని ఆయనకు తెలిపారు. అలాగే తమకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి తమకు ఆదివారం పట్టిన దోషాన్ని తొలగించాలని ఎంపీని కోరారు. దీంతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఎంపీ వారితో మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఈ ఎన్నికల్లో ఎన్నో ఆరాచకాలు, బెదిరింపులు, అక్రమ కేసులు పెట్టి లొంగదీసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీ నాయకులు కానీ, కార్యకర్తలు కానీ అలాంటి వాటికి లొంగక దీటుగా ఎదుర్కొంటారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూ పరీక్ష ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(ఏఎఫ్‌యూ)లో సోమవారం ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించిన 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ఢిల్లీ పర్యటనలో ఉన్న వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి. విశ్వనాథ కుమార్ అంతర్జాల మాధ్యమం ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి. ఫణీంద్రరెడ్డి మాట్లాడుతు విద్యార్థుల సంక్షేమార్థం త్వరితగతిన పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు చెప్పారు. సహాయ పరీక్షల నియంత్రణాధికారి ఉదయప్రకాష్‌రెడ్డి, నారపరెడ్డి, వర్సిటీ ప్రజాసంబంధాల అధికారి వి. శివకృష్ణారెడ్డి సిబ్బంది ప్రణీత, వీరాంజనేయరెడ్డి, బాలసుధీర్, యల్లారెడ్డి, గంగాప్రసాద్ పాల్గొన్నారు.

1321 టన్నుల యూరియా రాక



యూరియాను పరిశీలిస్తున్న జేడీఏ చంద్రానాయక్

కడప అగ్రికల్చర్ : జిల్లాకు 1321 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తెలిపారు. సోమవారం జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏవో గోవర్ధన్‌తో కలిసి జిల్లాకు రాక్‌లో వచ్చిన ఎరువులను ఆయన పరిశీలించారు. వైఎస్సార్ జిల్లాకు 942 మెట్రిక్ టన్నులను కేటాయించగా ఇందులో 426 మెట్రిక్ టన్నులను మార్క్‌ఫెడ్‌కు, మిగతా 516 మెట్రిక్ టన్నులను ప్రైవేటు డీలర్లకు కేటాయించారు. అలాగే అన్నమయ్య జిల్లాకు 380 టన్నులను కేటాయించారు. ఇందులో 235 టన్నులను మార్క్‌ఫెడ్‌కు, మిగతా 145 టన్నులను ప్రైవేటు డీలర్లు కేటాయించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ మాట్లాడుతూ డీలర్లు ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినట్లు తెలిసిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కలగా మారిన 'కల్తీ నియంత్రణ'

- సిబ్బంది కొరత
- కొరవడిన పర్యవేక్షణ
- నిస్సహాయంగా మారిన 'జిల్లా సహాయ ఆహార నియంత్రణ శాఖ'

మనిషి జీవించడానికి ప్రధానంగా కూడు, గూడు, గుడ్డ అవసరం. ఈ మూడింటిలో మనం తీసుకొనే ఆహారానికి ప్రథమ ప్రాధాన్యత ఉంటుంది. అయితే ఆహార అంశానికి చెందిన కీలకమైన 'జిల్లా సహాయ ఆహార నియంత్రణ శాఖ' సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఫలితంగా కల్తీ నియంత్రణ కలగా మారింది.



జిల్లా సహాయ ఆహార నియంత్రణ శాఖ

కడప రూరల్ : మనం తీసుకొనే ఆహార పదార్థాలకు సంబంధించిన అంశాలను 'జిల్లా సహాయ ఆహార నియంత్రణ శాఖ'పరిధిలోకి వస్తాయి. అంటే మనిషి ఆరోగ్య పరిరక్షణలో ఈ శాఖ పాత్ర ఎంతో కీలకమైంది. అలాంటి సంస్థ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది.

సంస్థ లక్ష్యం ఇదీ...

మనం తినే ప్రతి ఆహారాన్ని పర్యవేక్షించే బాధ్యతలు ఈ శాఖ పరిధిలోకే వస్తాయి. హోటళ్లు, బేకరీలు, గోధుమ, పసుపు, నూనెలు, పండ్ల వ్యాపారాలు తదితర ఆహార పదార్థాల విక్రయ తయారీ కేంద్రాల్లోని కల్తీలను ఆ శాఖ పరిశీలించాలి. అందుకు సంబంధించి జిల్లాలో రెండు డివిజన్‌లు ఉన్నాయి. కడప డివిజన్–1లో కడప కార్పొరేషన్‌తో పాటు బద్వేల్, మైదుకూరు. ప్రొద్దుటూరు డివిజన్–2 పరిధిలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల ఉన్నాయి. ఒక డివిజన్‌కు ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. వీరి పర్యవేక్షణలోనే కల్తీల తనఖీలు జరుగుతుంటాయి. ఫిర్యాదులు వచ్చినా లేదా ఏదైనా అనుమానం ఉన్నా తనిఖీలు చేపడతారు. అలాగే ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం కూడా చర్యలు తీసుకుంటారు. వివిధ పదార్థాలు..వస్తువుల నుంచి ఒక నెలకు 12 శ్యాంపిల్స్ తీయాలి. అంటే ఒక శ్యాంపిల్‌తో పాటే అదనంగా రెండు తీసుకుంటారు. ఆ ప్రకారం ఒక నెలకు మొత్తం 36 శ్యాంపిల్స్‌ను తీస్తారు. ఒక్కో శ్యాంపిల్ చొప్పున కల్తీ నిర్ధారణ పరీక్షల కోసం హైదరాబాద్‌లోని నాచారంలో గల ల్యాబొరేటరీకి పంపిస్తారు. అక్కడ నుంచి వచ్చిన నివేదికల ప్రకారం ఇక్కడి అధికారులు చర్యలు తీసుకుంటారు. ఉదాహరణకు పరీక్షల్లో నాసిరకం అని తేలితే 'సబ్ స్టాండెడ్, మిస్ బ్రాండెడ్' అని అంటారు. దీనికి జిల్లా జాయింట్ కలెక్టర్ స్థాయిలో విచారణ జరుగుతుంది. అలాగే తినడానికి వీలులేని పదార్థాలు, వస్తువులను 'అన్‌సేఫ్'అంటారు. దీనికి న్యాయ స్థానం శిక్ష ఖరారు చేస్తుంది. సంబంధిత వ్యక్తికి రూ 2 లక్షల నుంచి రూ 10 లక్షల వరకు భారీగా జరిమానా పడడంతో పాటు రెండేళ్ల జైలు శిక్ష కూడా పడుతుంది. అదేవిధంగా ఈ శాఖ ప్రభుత్వ రంగ సంస్థలైన హస్టళ్లు, ఐసీడీఎస్ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ఆహార పథకాలను కూడా పర్యవేక్షించే అధికారం ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ సంస్థ లక్ష్యాల జాబితా చాంతాడంత ఉంటుంది.

శాపంగా మారిన కొరత...

కీలకమైన ఈ శాఖకు కొరత శాపంగా మారింది. ముఖ్యమైన జిల్లా ఆహార సహాయ భద్రతా అధికారి (అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్) పోస్ట్ ఇన్‌చార్జీల పాలనలో నడుస్తోంది. ఇన్నాళ్లు పనిచేసిన ప్రభాకర్‌రావు ఒక నెల క్రితం పదవీ విరమణ పొందారు. దీంతో నెల్లూరు జిల్లా అధికారి వెంకటేశ్వరరావును ఇక్కడ ఇన్‌ఛార్జి అధికారిగా నియమించారు. ఈయన మరో రెండు జిల్లాలకు కూడా ఇన్‌ఛార్జి అధికారిగా విధులను చేపడుతున్నారు. ఇక అసిస్టెంట్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ల పాత్ర ఎంతో కీలకమైంది. కల్తీ నియంత్రణలో వీరి ప్రాత్ర ప్రధానమైంది. కడప డివిజన్–1లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న షంషీర్‌ఖాన్ మే 23వ తేదీన బదిలీ అయ్యారు. దీంతో ప్రొద్దుటూరు డివిజన్–2 విధులను చేపడుతున్న హరిత, కడప డివిజన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. అలాగే కార్యాలయంలో మరికొన్ని పోస్టులకు సంబంధించి ఖాళీలు ఉన్నాయి. ప్రధానంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు వాహనాలు లేకపోవడం శోచనీయం.చివరికి ఆ శాఖ జిల్లా సహాయ అధికారికి కూడా వాహనం లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నా..ఎవరైనా ఫిర్యాదు చేసినా బస్సులు లేదా తమ ద్విచక్ర వాహనాల్లో వెళ్లాలి. మారుమూల ప్రాంతాల్లోకి ఉన్నఫలంగా వెళ్లాలన్నా, రోజు వారీ పనులను నిర్వహించాలన్నా, ఈ సంస్థ అధికారులకు పెద్ద పరీక్షలా మారింది.

జిల్లాలో తక్కువ సంఖ్యలో రిజిస్ట్రేషన్లు?

జిల్లా వ్యాప్తంగా కుప్పలు, తెప్పలుగా హోటళ్లు, రెస్టారెంట్లు, తినుబండారాలు, వస్తువులను తయారు చేసే కేంద్రాలు లెక్కలేనన్ని ఉన్నాయి. కాగా ఈ శాఖ పరిధిలో అధికారికంగా లైసెన్స్, రిజిస్ట్రేషన్ కలిగిన సంస్థలు తక్కువ సంఖ్యలో ఉండడం గమనార్హం. లైసెన్స్ పరిధిలోకి పెద్ద హోటళ్లు, నూనె తదితర ఆహార పదార్థాల తయారీ కేంద్రాలు, హోల్‌సేల్, రిటైల్ డిస్ట్రిబ్యూటర్లు తదితర వ్యాపార కేంద్రాలు వస్తాయి. రిజిస్ట్రేషన్ పరిధిలో చిన్న హోటళ్లు ఉంటాయి. అధికారికంగా అన్నింటినీ కలుపుకున్నా లైసెన్స్, రిజిస్ట్రేషన్ కలిగినవి తక్కువ సంఖ్యలోనే కనిపిస్తున్నాయి.

గాలిలో పర్యవేక్షణ...

ఆహర పదార్థాలు కలుషితం అవుతే మనిషి అనారోగ్యం పాలవుతారు. ఫుడ్ పాయిజన్ అయితే ఆరోగ్యం విషమంగా మారుతుంది. చిన్న పిల్లలు, పెద్దలకు కడుపులో మంట, నొప్పి, వాంతులు, విరేచనాలు ఇలా ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే డాక్టర్ వద్దకు వెళతారు. సదరు వైద్యుని నుంచి 'ఎక్కడ తిన్నారు..ఏం తిన్నారు'. అనే ప్రశ్న వస్తుంది. కలుషిత ఆహారం తీసుకొని పలువురు అస్వస్థతకు గురైన సంఘటనలు ఎన్నో చూశాం. కాగా సమస్యలు..ఇబ్బందులు ఇలా ఎన్నయినా ఉండవచ్చు. 'ఆహార నియంత్రణ'లో పర్యవేక్షణ మాత్రం కొరవడిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ శాఖను గాలికి వదిలేయకుండా, ప్రజా ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించేలా చర్యలు చేపట్టాలనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. వివరణకు ఏఎఫ్‌సీ వెంకటేశ్వరరావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరితను సంప్రదించగా వారు అందుబాటులోకి రాలేదు.

క్లుప్తంగా

కల్యాణ మూర్తులకు మహా సంప్రోక్షణ


గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

బ్రహ్మంగారిమఠం : శ్రీ మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి మాస కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం నూతన కల్యాణ విగ్రహ మూర్తులకు మహా సంప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు గోపూజ కార్యక్రమం చేపట్టారు. ఇప్పటి వరకు స్వామి వారికి ఏటా జయంతి వేడుకలు, మహాశివరాత్రి సందర్భంగా కల్యాణోత్సవం నిర్వహించే వారు. భక్తులు, దాతల విన్నపం మేరకు ప్రతి నెలా మాస కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఫిట్ పర్సన్ సి.శంకర్‌బాలాజి, మేనేజర్ ఈశ్వరయ్య, బెంగళూరుకు చెందిన గౌరీ శంకరాచారి, పద్మావతమ్మ దంపతులు, రవికుమార్, ఆయన సతీమణి నలినాక్షి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు మాతా గోవిందమ్మ, వీరబ్రహ్మేంద్ర స్వామి మాస కల్యాణం

కాలజ్ఞాన ప్రబోధ కర్త పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబల మాస కల్యాణ మహోత్సవం బ్రహ్మంగారిమఠంలో మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక మఠంలో ఉన్న దివంగత మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు. కల్యాణంలో పాల్గొనదలచిన భార్యాభర్తలు సంప్రదాయ దుస్తుల్లో రావాలన్నారు. కల్యాణం శాశ్వత దాతలుగా లక్ష రూపాయలు విరాళం ఇచ్చి చేరేందుకు అవకాశం ఉందన్నారు.

కోర్టు ఉత్తర్వుల మేరకు తీర్మానాలను ఆమోదించండి


అదనపు కమిషనర్ రాకేష్ చంద్రకు వినతి పత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు జూన్ 20వ తేదీ నగరపాలక సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలను ఆమోదించి అమలు పరచాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కోరారు. సోమవారం కార్పొరేటర్లు శివకోటిరెడ్డి, అజ్మతుల్లా, డివిజన్ ఇన్‌చార్జులు ఐస్‌క్రీం రవి, సుబ్బరాయుడు, బసవరాజులు అదనపు కమిషనర్ రాకేష్ చంద్రకు మేయర్ రాసిన లేఖను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల దృష్ట్యా జూన్ 20వ తేదీ నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మెజార్టీ కార్పొరేటర్లు తీర్మానించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని జూలై 24న హైకోర్టు ఉత్తర్వులిచ్చిందన్నారు. ఈ మేరకు ఆ అంశాలన్నింటినీ నగరపాలక సంస్థ మినిట్స్ బుక్‌లో రాసి వాటి అమలుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ దళితవాడకు సమీపంలో ఈ నెల 3వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆగి ఉన్న కారును బైకు ఢీకొన్న ఘటనలో బోనంశెట్టి రవీంద్రకు తీవ్ర గాయాలైన విషయం విదితమే. ఆయన కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు రామాపురం పోలీసులు తెలిపారు.

గొర్రెల్లో నీలి నాలుక వ్యాధి

- వాతావరణ మార్పులతో గొర్రెలు, మేకలకు వ్యాప్తి
- అప్రమత్తం అవసరం అంటున్న పశువైద్యులు
- అల్లోపతి, ఆయుర్వేదిక్, హోమియో చికిత్సలతో నివారణ


గొర్రెల మంద

కడప అగ్రికల్చర్ : జిల్లాలో రుతుపవనాల ఆగమనంతోపాటు ఉపరితల ఆవర్తణంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షాలు ప్రారంభమయ్యాయి. గొర్రెలు, మేకల యజమానులు మారిన వాతావరణంతో పాటు అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలతో అప్రమతంగా ఉండాల్సిన అవసరం ఉంది. జిల్లా వ్యాప్తంగా 433588 గొర్రెలు, 176123 మేకలు ఉన్నాయి. ఈ వర్షాల రాకతో గొర్రెలు, మేకలకు నీలి నాలుక వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధిని ఆయా ప్రాంతాలను బట్టి మూతివాపు వ్యాధి, నోటి పుండ్ల వ్యాధి వంటి పేర్లతో కూడా పిలుస్తుంటారు. ఈ వ్యాధి మందలో ఒకేసారి గొర్రెలకు సోకే అవకాశం ఉంది. వ్యాధి సోకిన గొర్రెలు మృత్యువాత పడే పరిస్థితులు కూడా ఎక్కువగా ఉంటాయి. కనుక గొర్రెలు, మేకల కాపర్లు, యజమానులు ఈ వర్షాకాలంలో గొర్రెల పెంపకంలో అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో ఇప్పటికే చాలా మండలాల్లో ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నట్లు పలువురు గొర్రెలు, మేకల యజమానులు తెలిపారు.

వ్యాధి వ్యాప్తి ఇలా..

గొర్రెలకు ఈ వ్యాధి వైరస్ ద్వారా సోకుతుంది. ఈ వైరస్ మాధ్యమిక అతిదేయి దోమ(క్యూలికాయిడ్స్) జాతికి చెందిన కీటకాల ద్వారా వ్యాప్తి చెందుతుంది. మందలో ఒక గొర్రెకు ఈ వ్యాధి వస్తే ఒక గొర్రె నుంచి మరో గొర్రెకి వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా జులై, ఆగస్టు, సెప్టెంబర్, డిసెంబర్ నెలల్లో ఈ వ్యాధి ప్రబలుతుంది.

వ్యాధి లక్షణాలు ఇలా..

- గొర్రెలలోకి వైరస్ ప్రవేశించిన వారం రోజుల్లో దాని ప్రభావం కనిపిస్తుంది
- 105 నుంచి 106 డిగ్రీల జ్వరం వచ్చి ఐదు రోజుల పైబడి ఉంటుంది
- జ్వరం వచ్చిన 48 గంటల తర్వాత నోటి నుంచి చొంగ కారడం, నోరు మొత్తం ఎర్రగా మారడం, చొంగ కూడా నురుగలా మారి పెదవులు, చిగుళ్ల, పై దవడ, నాలుక వాచిపోవడం, నాలుక ఇరువైపులా పుండ్లు ఏర్పడి బాగా ఉబ్బి నీలిరంగుకు మారుతుంది.
- గొర్రెలకు రక్తపు జీరలు కనిపించడం, ముక్కు లోపల భాగం నుంచి చీము రావడం, చీముతోపాటు రక్తం రావడం చేస్తుంది. ఆ తరువాత ముక్కులో జిగురు ఎండిపోవడంతో శ్వాస తీసుకోలేని పరిస్థితి ఏర్పడి గొర్రెలు, మేకలు చనిపోయే అవకాశం ఉంటుంది, ఈ వ్యాధి గొర్రెలకు, మేకలకు సోకినప్పుడు వాటిల్లో గర్భస్రావం కూడా అయ్యే అవకాశం ఉంటుంది
- వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న గొర్రెలలో వ్యాధి కాళ్లకు కూడా పాకుతుంది. గిట్టల మొదటి భాగం ఎర్రగా కందిపోయి వాపి చీముపట్టి నడవలేక కుంటుతాయి
- ఈ రోగం కారణంగా మేత తినలేకపోవడం వలన జీవాలు నీరసించి బరువు కోల్పోయి మృత్యువాత పడతాయి
- వ్యాధి చివరి దశలో నాలుక నీలిరంగుకు మారుతుంది. నోటి నుంచి దుర్వాసన వస్తుంది.
- ఈ వ్యాధి మేకలకు అరుదుగా సోకుతుంది.

వ్యాధి నివారణ ఇలా..

- జబ్బు చేసిన వాటిని మందలోని ఆరోగ్యవంతమైన జీవాల నుంచి వేరు చేయాలి. తర్వాత వేరు చేసిన వాటికి చికిత్స చేయాలి.
- పొటాషియం పర్మాంగనేట్ ఒక శాతం ద్రావంతో నోటిలో పుండు కలిగి శుభ్రమైన పొడిగుడ్డతో తుడిచి బోరో గ్లిసరిన్ ఆయింట్‌మెంట్ రాయాలి. లేదా టాపిక్యూర్ ఓరల్ స్ప్రే కూడా వాడవచ్చు
- పశువైద్య డాక్టర్‌ను సంప్రదించి పెన్సిలిన్, ఓరల్ ఎన్రోఫ్లాక్సోసిస్ వంటి యాంటిబయాటిక్‌లను, జ్వరం రాకుండా మెలోనెక్స ప్లస్ మందులు నోటి ద్వారా గాని, ఇంజక్షన్ రూపంలో ఐదు నుంచి ఏడు రోజుల పాటు ఇవ్వాలి.
- గొర్రెలు నీరసంగా ఉంటే గ్లూకోస్, ఎలక్ట్రాల్ పౌడర్‌ను నీటిలో కలిపి తాగించాలి. వ్యాధి నుంచి కోలుకున్నాక సెలైనులు ఎక్కించడం, లివర్‌టానిక్, బలానికి విటమినులు కలిగిన టానిక్‌లు, ఖనిజ లవణాలు అందించాలి


నీలి నాలుక వ్యాధి సోకడంతో ఎర్రగా మారిన కళ్లు

ఆయుర్వేదిక్ చికిత్స కూడా..

- ఈ వ్యాధి సోకిన గొర్రెలు, మేకలకు నేరేడు చెక్క 100 గ్రాములు, తులసి ఆకులు 50 గ్రాములు, నేలవేము ఆకులు 50 గ్రాములు నూరి ముద్ద చేసి రోజుకు ఒక సారి 3 రోజులు ఇవ్వాలి.
- 150 గ్రాముల వావిల ఆకులు, 100 గ్రాములు వేపాకు ఒక లీటరు నీటిలో అర లీటరు అయ్యే వరకు మరిగించి ఆ అర లీటరు నీటిని రోజుకు రెండు సార్లు చొప్పున 3 రోజులు ఇస్తే తగ్గిపోతుంది.

హోమియో చికిత్స ఇలా..

వ్యాధి సోకిన వాటికి ఉదయం ఎకినేసియ 200, మెర్క్ సాల్ 200, ఆసియం 200 మందులు తీసుకుని 5 చుక్కలు లేదా 5 మాత్రలు, 5 ఎంఎల్ వైవిరాల్ అనే విటమిన్లు ద్రావణంలో కలిపి ఇవ్వాలి.

మధ్యాహ్నం..

రుస్ టాక్స్ 200లను 5 చుక్కలు లేదా 5 మాత్రలు వేయాలి.

సాయంత్రం..

పల్సటిల్ల 200లను 5 చుక్కలు లేదా 5 మాత్రలను వేయాలి. లేదంటే జెమ్ ఫార్మ వారి బూటి – డీఎస్ఓ అనే మందును వాడాలి.

జాగ్రత్తలను పాటించాలి..



ఈ వ్యాధి దోమకాటుతో వ్యాప్తి చెందుతుంది. కనుక గొర్రెల కాపర్లు సాయంత్రం వేళ 6 నుంచి 7 గంటలలోపే దోమలు కుట్టకుండా వేపాకు లేదా యూకలిప్టస్ ఆకు లేదా కలబందను కాల్చి మంద చుట్టూ వేయాలి. ఈ పొగకు దోమలు దూరంగా పారిపోతాయి. ముఖ్యంగా వ్యాధి సోకిన గొర్రెను మంద నుంచి వేరుచేయాలి. ఎందుకంటే దానిని కుట్టిన దోమ ఆరోగ్యంగా ఉన్న గొర్రెను కుడితే దానికి కూడా వ్యాధి సోకుతుంది. గొర్రెలు, మేకల షెడ్లలో కీటకాలను చంపేందుకు ముందులు పిచికారి చేసుకుంటే వ్యాధి సోకకుండా ఉంటుంది.

– డాక్టర్ రాంబాబు, పశువైద్యాధికారి, కడప

తప్పకుండా టీకాలు వేయించుకోవాలి..



ప్రభుత్వం తరుపున ఇండియన్ ఇమ్యూనోలాజికల్ లిమిటెడ్ సంస్థ రక్షా బ్లూ పేరిట సరి కొత్త టీకాను రూపొందించింది. 2 మిల్లీలీ ఇంజక్షన్‌ను కండకుగానీ, చర్మం కింద గాని ఇవ్వాలి. కండకు ఇవ్వడం వల్ల నొప్పులు ఉండవు. గర్భంతో ఉండే జీవాలకు ఈ టీకాను ఇవ్వకూడదు. టీకాను వేసిన తరువాత 21 రోజులలోపు కబేళాలకు పంపకూడదు.

– డాక్టర్ శారదమ్మ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

సెల్‌ఫోన్లను వెనక్కి ఇచ్చిన అంగన్‌వాడీలు


సెల్‌ఫోన్లను వెనక్కి ఇచ్చేందుకు వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జిల్లాలోని కడప అర్బన్ పరిధిలో అంగన్‌వాడీలు సెల్ ఫోన్లను సీడీపీఓలకు వెనక్కి ఇచ్చినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, జిల్లా కోశాధికారి ఎంపీ అంజలీదేవి తెలిపారు. ఈ మేరకు సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శనగా వచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ చాలా నెలలుగా సెల్ ఫోన్లు పని చేయడం లేదన్నారు. అయినప్పటికీ ఐసీడీఎస్ అధికారులు స్పందించకపోవడంతో తప్పని పరిస్థితుల్లో సెల్‌ఫోన్లు వెనక్కి ఇచ్చామన్నారు. ఐసీడీఎస్ అధికారులు వెంటనే కొత్త సెల్‌ఫోన్లను ఇచ్చి యాప్‌ల పేరుతో భారం తగ్గించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాంతి. వెంగమాంబ, వినీల, భారతి. కవిత, సుమలత, ఉదయ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వృద్ధురాలి మృతి

కలికిరి : ఆటో ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన సోమవారం కలికిరి పట్టణ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... కేవీ పల్లి మండలం నూతనకాల్వ గ్రామం దిండువారిపల్లికి చెందిన చింతపర్తి మంగమ్మ(82) కలికిరిలోని తన బంధువుల ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా కలికిరి పట్టణానికి చెందిన సుబహాన్ ఆటోతో ఢీకొన్నాడు. ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మంగమ్మ కుమార్తె రామ కుమారి ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవరుపై కేసు నమోదు చేశారు.

విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

కమలాపురం : విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. సోమవారం కమలాపురంలో నిర్వహించిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులపై ఫీజుల భారం అధికం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నడుపుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగేశ్వర రావు, రెడ్డయ్య, రమణ, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ఏఐఎస్ఎఫ్ కమలాపురం ఏరియా నూతన కమిటీని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. కమలాపురం ఏరియా అధ్యక్షుడిగా రాఘవేంద్ర, కార్యదర్శిగా షేక్ సాదిక్, ఉపాధ్యక్షుడిగా మణికంఠ రెడ్డి, తిలక్, సహాయ కార్యదర్శులుగా షేక్ రబ్బాని, సుబ్బరాయుడు, వెంకటసాయి, కోశాధికారిగా శశికాంత్, సోషల్ మీడియా సభ్యులుగా ఫయాజ్, అంజి తదితరులను ఎన్నుకున్నారు.

నులి పురుగుల నివారణకు చర్యలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : పిల్లల్లో నులి పురుగులు నిర్మూలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం సందర్భంగా సోమవారం తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. 1 నుంచి 2 సంవత్సరాలలోపు పిల్లలకు 200 మిల్లీ గ్రాములు, 3 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు 400 మిల్లీ గ్రాములు చొప్పున అల్బేండజోల్ మాత్రలు ఇవ్వాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం తర్వాత వీటిని మింగించాలన్నారు. పాఠశాలకు వెళ్లని పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో మింగించాలన్నారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పిల్లలు గోర్లు కత్తిరించుకోవడం, భోజనానికి ముందు, మల విసర్జన తర్వాత చేతులు సబ్బుతో కడుక్కోవడం, కాళ్లకు చెప్పులు ధరించడం, మరుగుదొడ్లను వినియోగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. 1–19 ఏళ్ల పిల్లలకు ఈనెల 12, 20 తేదీలలో నులి పురుగుల నివారణ మందు మింగించాలన్నారు. తొలుత ఆమె ఇతర అధికారులతో కలిసి జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీఈఓ షంషుద్దీన్, ఐసీడీఎస్ పీడీ, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

షిఫ్ట్ ఆపరేటర్‌పై దాడి

మైదుకూరు : మండలంలోని ఆదిరెడ్డిపల్లె విద్యుత్ సబ్ స్టేసన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న బండి సురేష్‌పై దాడి జరిగిన విషయంపై మైదుకూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వనిపెంట సెక్షన్‌లోని ఆదిరెడ్డిపల్లె సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుండగా శనివారం తెల్లవారుజామున తిప్పిరెడ్డిపల్లె కొత్తపల్లెకు చెందిన మాదం నాగేశ్వరరావు అనే వ్యక్తి వెళ్లి కరెంట్ ఇంకా ఎందుకు వదల్లేదని ప్రశ్నించాడు. దానిపై సురేష్ సమాధానం చెప్పేలోపే బిల్లులు వసూళ్లకైతే ముందుంటారు.. కరెంట్ ఎందుకు వదలరంటూ అతనిపై కట్టెతో దాడి చేశాడు. దాడిలో సురేష్ కంటి వద్ద తీవ్ర రక్తగాయమైంది. గాయపడిన ఆపరేటర్‌ను 108 వాహనంలో చికిత్స కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనపై బాధితుడు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇచ్చాడు. విధుల్లో ఉన్న తనపై నాగేశ్వరరావు దాడి చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ కె.రమణారెడ్డి తెలిపారు.

వైవీయూపై విద్యార్థి సంఘాల ఆరోపణలు అవాస్తవం

కడప ఎడ్యుకేషన్ : కొన్ని విద్యార్థి సంఘాలు పనిగట్టుకొని విశ్వవిద్యాలయ పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేలా ఆరోపణలు చేస్తున్నాయని అలాంటి వారిపట్ల ఉపేక్షించేది లేదని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూషనల్ వర్క్‌లో వందలోపు ర్యాంకు, న్యాక్ ఏ గ్రేడ్‌తో, అత్యున్నత పరిశోధనా ప్రమాణాలతో విశ్వవిద్యాలయం ప్రగతి పథంలో వెళుతుంటే పనిగట్టుకొని కొన్ని విద్యార్థి సంఘాలు విశ్వ విద్యాలయంపై విషం చిమ్ముతున్నాయన్నారు. తాజాగా కాన్వకేషన్ నిర్వహణకు రాష్ట్ర గవర్నర్‌ను కలిసి అనుమతి తీసుకొని ప్రక్రియను ప్రారంభించామన్నారు. ఇంతలోనే కాన్వకేషన్ ముసుగులో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నట్లు కొన్ని విద్యార్థి సంఘాలు ఆరోపించడం దారుణమన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ బహూకరించేందుకు ఒక కమిటీ నియమించి వారి పర్యవేక్షణలో వాటిని తయారు చేయిస్తామన్నారు. గోల్డ్ మెడల్ అందజేసిన దాతల సమక్షంలో వాటిని కాన్వకేషన్ సమయంలో ముఖ్య అతిథి చేతుల మీదుగా అందజేస్తారన్నారు. విద్యార్థి సంఘాలు వారి ఆరోపణలను వెనక్కి తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకు వెళతానని ఆయన స్పష్టం చేశారు.

మృత్యు కుహరంగా పెన్నా నది

రెండేళ్ల వ్యవధిలోనే పది మందికిపైగా మృత్యువాత


పెన్నానదిలోని ప్రమాదకరమైన గుంత

జమ్మలమడుగు : పెన్నానది మృత్యుకుహరంగా మారుతోంది. పెన్నానదిలో నీరు ఉండటంతో ఈత కోసం, స్నానాల కోసం దిగి లోతు తెలుసుకోలేక గుంతల్లో పడి మరణిస్తున్నారు. పెన్నానదిలో ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా చేయడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ప్రతి ఏడాది పెన్నానది లోకి తాగునీటి అవసరాల కోసం మైలవరం జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో గుంతలన్నీ పూడిపోయి ఎక్కడ ఏమి ఉందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది జూన్ మొదటి వారంలో తెలంగాణ ప్రాంతం హైదరాబాద్‌కు చెందిన మనోహర్ అతని కుమారుడు ఇయోల్ సోదరి ఇంటికి వచ్చి పెన్నానదిలో భార్య కళ్లెదుటే భర్త, కుమారుడు నీటిలో మునిగి మరణించారు. ఇది మరచిపోకముందే ఆగస్టు 1వతేదీ చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా బారికేడ్ల నిర్మాణం కోసం కడప నుంచి కూలీలు జమ్మలమడుగుకు వచ్చారు. పనులు పూర్తయిన తర్వాత స్నానం చేయడం కోసం పెన్నానదిలోకి షేక్ మున్నా, గోపాల్‌లు దిగారు. అయితే లోతును సరిగా గుర్తించలేక పోయి నీటిలో మునిగారు. అదే సమయంలో పెన్నానదిలో దుస్తులు ఉతికేందుకు వచ్చిన రజకులు పరుగున వచ్చి వారిని బయటకి లాగే ప్రయత్నంలో భాగంగా చీరె వేసినా వారు అందుకోలేకపోయారు. దీంతో ఇరువురు గల్లంతయ్యారు. గాలింపు చర్యలు చేపట్టి షేక్ మున్నా మృతదేహాన్ని బయటికి తీశారు. అయితే గోపాల్ మృతదేహం రెండు రోజుల తర్వాత లభించింది. పెన్నానదిలో కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే పది మందికిపైగా మునిగి చనిపోయారు. పెన్నానది సమీపంలో హెచ్చరిక బోర్డులు పెట్టినా స్నానం చేసేందుకు చాలా మంది నీళ్లలోకి దిగుతున్నారు. ప్రస్తుతం పెన్నానది లోనికి మైలవరం జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. నీటి గుంతలు అన్నీ మునిగిపోయి ఉన్నాయి. ఎవరు గుంతల్లో దిగినా గల్లంతయ్యే ప్రమాదం ఉంది. అధికారులు పెన్నానదిలోకి ఎవరూ దిగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీ నేత భూ ఆక్రమణలపై ఆర్డీఓకు ఫిర్యాదు


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి

బద్వేలు అర్బన్ : పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీ కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన రంగసముద్రం చెరువు ఆయకట్టు చైర్మన్, టీడీపీ నాయకుడు చెరుకూరి వీరచెంద్రాయుడు భూ ఆక్రమణలపై పోరుమామిళ్లకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి సోమవారం ఆర్డీఓ ఎ.చంద్రమోహన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కమ్మవారిపల్లెకు చెందిన టీడీపీ నేత వీరచెంద్రాయుడు తన అధికార బలంతో రాత్రికి రాత్రే రికార్డులు తారుమారు చేసి దాదాపు వంద కోట్లు విలువ చేసే భూములు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రంగసముద్రం రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 75 లో దాదాపు రూ.5 కోట్లు విలువ చేసే 3.22 ఎకరాల భూమిని 2017లో అసైన్‌మెంట్ కమిటీలో డీకేటీ పట్టాలు పొందినట్లు చూపుతున్నారని, అసలు అసైన్‌మెంట్ కమిటీలో భూమి పొందేందుకు ఆయన ఎలా అర్హుడయ్యారో సమాధానం చెప్పాలన్నారు. అలాగే ఇదే గ్రామ పొలంలోని సర్వే నెంబర్ 419 లో 74 సెంట్లు, 432 లో 94 సెంట్లు అనువంశికం కింద ఆన్‌లైన్‌లో ఎక్కించారని, ఆ భూమి ఆయనకు అనువంశికం ఎలా వచ్చిందని ప్రశ్నించారు. అలాగే పోరుమామిళ్ల పట్టణంలోని సుందరయ్యకాలనీకి దక్షిణ భాగాన ఉన్న సర్వే నెంబర్ 136–5 లో మాజీ సైనికోద్యోగి నాగరాజు పేరుతో ఆర్మీ కోటాలో భూమి పొందారని, ఇది అధికారులను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. జిల్లా అధికారులు స్పందించి టీడీపీ నేత భూ ఆక్రమణలపై విచారణ జరిపించాలని కోరారు.

యూరియా సహా ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలి


డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి, బాలయ్య తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : యూరియా సహా అన్ని రకాల ఎరువులను తక్షణమే రైతులకు అందుబాటులో ఉంచాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడుకు వినతిపత్రాన్ని సమర్పించారు. రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి, జెడ్పీ ఉపాధ్యక్షుడు బాలయ్య మాట్లాడుతూ అధికారులతో అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామ స్థాయి వరకు ఎరువుల పంపిణీపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో నిల్వలు పెంచి అక్కడే రైతులకు అందజేయాలని కోరారు. బ్లాక్ మార్కెట్‌కు తరలించే వ్యాపారుల లైసెన్సులు తక్షణమే రద్దు చేయడంతోపాటు కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎరువుల నిల్వలపై వ్యవసాయశాఖ ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు జీఎన్ భాస్కర్‌రెడ్డి, చెన్నూరు ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, రైతు విభాగం కడప నగర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, చెన్నూరు వైస్ ఎంపీపీ చిన్నా, రాచిన్నాయపల్లె సర్పంచ్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు

నందలూరు : నందలూరు పోలీసు స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 15/2022 కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న తిరుపతి పట్టణం కరకంబేడు వీధికి చెందిన చంద్ర రమేష్ అనే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను స్టోర్ బియ్యం విక్రయం కేసులో నిందితుడిగా ఉండి, కోర్టు వాయిదాలకు హాజరుకానందున కోర్టు అతనిపై నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. నిందితుడిని సోమవారం నందలూరు కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించిందన్నారు.

విద్యుత్ షాక్‌కు గురైన బెంగాల్ వాసి మృతి

నిమ్మనపల్లె : విద్యుత్ షాక్‌కు గురైన పశ్చిమబెంగాల్ వాసి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. జూలై 30న మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ బాలేవాండ్లపల్లె వద్ద విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ పోల్ ఎక్కి పనులు చేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన సునేరామ్ (30) విద్యుత్ సరఫరా కావడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

మున్సిపల్ ఉద్యోగిపై దాడి

మదనపల్లె రూరల్ : మున్సిపల్ ఉద్యోగిపై దాడి చేసిన ఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. రామారావుకాలనీకి చెందిన సుధాకర్ మున్సిపాలిటీలో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధుసూదన థియేటర్ సమీపంలోని ఎస్‌కే.ఆయిల్ స్టోర్స్ వెనుకవైపున ఉన్న ఇంటిలో ఉండగా, కుటుంబ వివాదంలో భాగంగా గాంధీపురానికి చెందిన రాజా, రవి, ప్రదీప్ అనుచరులతో వచ్చి సుధాకర్‌పై దాడికి పాల్పడ్డారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకుల అరెస్టు


గంజాయి, బైక్ సహా నిందితులతో ఎక్సైజ్ అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను ప్రొద్దుటూరు ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సోమవారం ఎక్సైజ్ సీఐ సురేంద్రారెడ్డి మీడియాకు వెల్లడించారు. ప్రొద్దుటూరులోని శ్రీరాంనగర్‌కు చెందిన కుంటుమల్ల సంతోష్, మహేంద్రనగర్‌కు చెందిన చౌడం ప్రేమచక్రి, మత్స్యకాలనీకి చెందిన గొర్రె నాగసాయి మిత్రులు. వీరు జల్సాలకు అలవాటు పడి చెడు వ్యసనాలకు లోనయ్యారు. దీంతో సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో నిషేధిత గంజాయి విక్రయించే మార్గాన్ని ఎంచుకున్నారు. పట్టణంలో కొన్ని ప్రాంతాల్లోని యువకులను పరిచయం చేసుకొని గంజాయిని విక్రయిస్తున్నారు. గంజాయిని చిన్న చిన్న పొట్లాల రూపంలో చుట్టి రూ.500 నుంచి రూ. 5000 వరకు విక్రయిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ముగ్గురు యువకులు దొరసానిపల్లె రోడ్డులోని భావనారాయణ స్వామి ఆలయం వద్ద గంజాయి విక్రయిస్తుండగా ప్రొద్దుటూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రారెడ్డి, కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వరరెడ్డిలు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో ముగ్గురు యువకులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1800 గ్రాముల గంజాయి, మూడు ద్విచక్రవాహనాలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకడైన కుంటుమల్ల సంతోష్ విశాఖపట్టణం జిల్లాలోని నర్సీపట్నం వద్ద గల ఒక ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి చౌడం ప్రేమ్ చక్రి, గొర్రె నాగసాయిలకు విక్రయించేవాడని ఎక్సైజ్ సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించనున్నట్లు చెప్పారు.